
# ఆయనకు.. ఓటమి భయం..

**కొడంగల్‌లో ఓడిపోవడం ఖాయమని తెలిసి రేవంత్‌రెడ్డి అడ్డదారులు**



- బెదిరింపులు, డబ్బులతో ఎర..
- సర్పంచులను కొనుగోలు చేసేందుకు రేవంత్‌రెడ్డి కుట్రలు
- రేవంత్ కుట్రలను కొడంగల్ ప్రజల ముందు బయటపెట్టిన గిరిజన సర్పంచులు
- కొడంగల్ రూపురేఖలు మార్చిన నరేందర్‌రెడ్డివైపు నిల్చున్న సర్పంచులు
- బీఆర్‌ఎస్‌కే జై కొడుతున్న తండాల ప్రజలు
- రూ.1500 కోట్లకుపైగా నిధులతో నియోజకవర్గ అభివృద్ధి

వికారాబాద్, అక్టోబర్ 29, (నమస్తే తెలంగాణ): కొడంగల్‌లో రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నది. ఓడిపోవడం ఖాయమని తెలుసుకొన్న రేవంత్ అడ్డదారులను ఎంచుకున్నాడు. ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచులు, నాయకులకు బెదిరింపులు, డబ్బులతో ప్రలోభపెడుతున్నారు. తనకు ఓటేసి గెలిపించమని కొడంగల్ ప్రజలను అడిగేందుకు మొహం లేకపోవడం, ఓటుకు నోటు, నోటుకు టికెట్ వంటి అడ్డదారులు అచ్చొచ్చిన రేవంత్‌రెడ్డి ప్రజలను కాకుండా ఈ ఎన్నికల్లో డబ్బును నమ్ముకొని ముందుకెళ్తున్నారు. గతంలో ఎప్పుడులేని విధంగా కొడంగల్ అభివృద్ధికి భారీగా నిధులు తీసుకువచ్చి కొడంగల్ రూపురేఖలు మార్చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి వెంట కొడంగల్ ప్రజలు ఉన్నారని గ్రహించిన రేవంత్ అడ్డదారులకు తెరలేపారు. బెదిరింపులు, డబ్బులతో పలువురు సర్పంచులను కొనుగోలు చేసేందుకు రేవంత్‌రెడ్డి అండ్ కో.. కుట్రలు చేస్తున్నారు. ఇప్పటికే మాయమాటలు చెప్పి గుర్నాథ్‌రెడ్డిని పార్టీలోకి రప్పించుకున్నప్పటికీ సొంతూరులో తప్ప మిగతా ఎక్కడా కూడా గుర్నాథ్‌రెడ్డి ప్రభావం లేకపోవడం, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ గులాబీ దళం బలంగా ఉండడంతో సర్పంచులను కొనుగోలు చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. గతంలో ఎన్నోఏండ్లుగా తండాల ప్రజలు పడిన కష్టాలు, సమస్యలకు పరిష్కారం చూపిన బీఆర్‌ఎస్ పార్టీవైపు కొడంగల్ ప్రజల నిలుస్తూ రేవంత్‌రెడ్డి అండ్ కో.. చేసిన కుట్రలను బయటపెట్టిన గట్టెగానితండా, లోతుకుంటతండా, టేకులగడ్డ తండా సర్పంచులు హీరోలుగా నిలిచారు. తండాల్లో గతంలో గుక్కెడు తాగునీటి కిలోమీటర్ల కొద్ది నడిచివెళ్లిన పరిస్థితులు, వానకాలం వస్తే చాలు రాకపోకలు బంద్ కావడం, సీజనల్ వ్యాధులతో వైద్యం అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలు కోల్పోవడం వంటి దయనీయ పరిస్థితుల నుంచి ఇంటి ముందరే నల్లాతో స్వచ్ఛమైన తాగునీరు అందించగా, ప్రతి తండాకూ రోడ్లు, పల్లె దవాఖానలు ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది రాష్ట్ర సర్కార్. దీంతో గిరిజన సర్పంచులు, నాయకులు, ప్రజలంతా ఏ ఎన్నికలైనా బీఆర్‌ఎస్‌కే జై కొడుతామంటున్నారు. అంతేకాకుండా మరికొంత మందిని వివిధ ప్రలోభాలతో పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్నా తండాల ప్రజలతోపాటు కొడంగల్‌లోని సబ్బండ వర్గాల ప్రజల అభ్యున్నతితో పాటు, నియోజవర్గాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకువచ్చి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన నరేందర్‌రెడ్డిని మరోసారి గెలిపించుకునేందుకు సిద్ధమయ్యారు.

### మారిన కొడంగల్ రూపురేఖలు..

ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంగా ఉన్న కొడంగల్ నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోతున్నది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి స్పీడందుకున్నది. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించడం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దత్తత తీసుకోవడం, కొడంగల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి కృషితో ప్రభుత్వం రూ.1500 కోట్లకుపైగా నిధులొచ్చాయి. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజారోగ్యం, విద్య, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల పురోగతిని సాధిస్తున్న నియోజకవర్గంగా కొడంగల్ ముందుకు సాగుతున్నది. సీఎం కేసీఆర్ కోస్గిలో బస్‌డిపోతో పాటు బస్‌స్టేషన్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చి కోస్గి ప్రజల కలను నెరవేర్చారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికిగాను రూ.80కోట్ల నిధులిచ్చారు. రెండు మున్సిపాలిటీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. సీసీ రోడ్లు, దుకాణ సముదాయాలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. కొడంగల్ మున్సిపాలిటీలో 30 పడకల ప్రభుత్వ దవాఖాన, కోస్గిలో 50 పడకల దవాఖాన, మద్దూరులో 30 పడకల ఆసుపత్రితోపాటు కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి కొడంగల్ ప్రజలకు ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. బొంరాసుపేట్‌లో బీసీ గురుకుల, కొడంగల్‌లో మైనార్టీ గురుకుల, మద్దూరులో ఎస్సీ గురుకుల పాఠశాలలను మంజూరు చేసి పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యనందిస్తూ ఏటా ఒక్కో విద్యార్థికి రూ.లక్షన్నర చొప్పున ఖర్చు చేస్తున్నది. రూ.4 కోట్లతో కొడంగల్, కోస్గిలో యాదవ భవనాలు, ముదిరాజ్ భవనాలు, అంబేద్కర్ భవన్, రూ.కోటిన్నరతో కొడంగల్‌లో బంజారాభవన్‌ను నిర్మించారు. రైతుబంధు కింద ఒక్కో సీజన్‌కు 91,229 మంది రైతులకు రూ.100.10 కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.1046 కోట్ల పెట్టుబడి సాయాన్ని కొడంగల్ రైతులకు ప్రభుత్వం అందించింది. రైతుబీమా కింద మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.82.35కోట్ల సాయాన్ని, కల్యాణలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 8860 మంది లబ్ధిదారులకు రూ.58కోట్లు, షాదీముబారక్ కింద 1000 మందికి రూ.6.16కోట్లు, ఆసరా పింఛన్లు 37,236 మందికి రూ.9.42 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తూ అండగా నిలుస్తున్నది. కేసీఆర్ కిట్స్ పథకంలో భాగంగా ఇప్పటివరకు 9129 మందికి రూ.11.86కోట్ల విలువగల కిట్లను పంపిణీ చేసింది. మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ పనులకుగాను 299 చెరువులకు రూ.75.66 కోట్లతో చెరువులకు పూర్వవైభవం తీసుకువచ్చి 22వేల ఎకరాలకు చెరువుల ద్వారా సాగునీరిందిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో చేరితే రూ.15 లక్షలు ఇస్తామన్నారు



బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరితే ఒక్కొక్కరికీ రూ.15 లక్షల చొప్పున ఇస్తామని ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన డాక్యానాయక్ మమ్మల్ని ప్రలోభపెట్టాడు. నాతోపాటు టేకులగడ్డతండా, లోతుకుంట తండా సర్పంచ్‌లకు డబ్బులిస్తానని చెప్పాడు. దీంతో నాతో పాటు టేకులగడ్డతండాకు చెందిన శంకర్‌నాయక్, లోతుకుంటతండా సర్పంచ్ రవీనాయక్‌లు కలిసి శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వడిచెర్ల స్టేజీ వద్దకు వెళ్లాం. అక్కడ డాక్యానాయక్ మాకు డబ్బులిస్తుండగా పోలీసులు వచ్చి పట్టుకున్నారు. మాకు కాంగ్రెస్‌లో చేరే ఉద్దేశం లేనందునే వారి ప్రలోభాలను ముందే మేము పోలీసులకు చెప్పాం. నాయకుడి స్థాయిని బట్టి కాంగ్రెస్ నాయకులు ధర నిర్ణయించారు. కాంగ్రెస్ దొంగ పనులు, అరాచకాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. అభివృద్ధితో బీఆర్‌ఎస్ ముందుకు వెళ్తున్నది.

**- రాథోడ్ నర్సింహానాయక్, గట్టెగానితండా సర్పంచ్ కొడుకు**

### అమ్ముడు పోయేవాళ్లం కాదు



గట్టెగానితండా సర్పంచ్ కొడుకు నర్సింహానాయక్ మాకు ఫోన్‌చేసి కాంగ్రెస్ పార్టీలో చేరితే డబ్బులు ఇస్తామని డాక్యానాయక్ చెప్పారని వెళ్దాం రండి అంటే వెళ్లా. వడిచెర్ల గేటు వద్దకు వెళ్లే సమయానికి డాక్యానాయక్ కారులో డబ్బులున్నాయి. కొద్ది నిమిషాల్లోనే పోలీసులు వచ్చి స్వాధీనం చేసుకున్నారు. మేము పార్టీకి అమ్ముడు పోయేవాళ్లం కాదు. నాకు బీఆర్‌ఎస్ అన్నా, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నా ప్రాణం. పార్టీ కోసం పని చేస్తాం.

**-రవినాయక్, లోతుకుంటతండా సర్పంచ్**

### పైసలకు పార్టీలు మారం..



మేము పైసలు తీసుకుని పార్టీలు మారే వాళ్లం కాదు. పార్టీ కోసం చావనైనా చస్తాం కానీ అలాంటి పనులు చేయం. మా పార్టీ నుంచి వెళ్లిన డాక్యానాయక్ బీఆర్‌ఎస్ సర్పంచ్‌లను కొనడానికి ప్రయత్నాలు చేస్తుండడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయనపై ఓ కన్నేసి ఉంచాం. బీఆర్‌ఎస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తాం. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదు. ఎన్ని డబ్బులు ఇస్తామన్నా కాంగ్రెస్ నాయకులకు లొంగం.

**- శంకర్‌నాయక్, టేకులగడ్డతండా సర్పంచ్ భర్త**

# కాంగ్రెస్‌లో.. అసమ్మతి గళం

**-రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో చిచ్చురేపిన రెండో జాబితా**
**-మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలలో అసమ్మతి రాగం**
**-అభ్యర్థిత్వాలపై పునరాలోచించాలని కాంగ్రెస్ అధిష్టానానికి నేతల సూచన**
**-తమ అనుచరులతో సమాలోచనలు**
**-టికెట్ దక్కని నేతల దారెటు?**




రంగారెడ్డి, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండో జాబితా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతున్నది. టికెట్ ఆశించి భంగపడిన నేతలు అసమ్మతిరాగం అందుకుంటున్నారు. రెండో జాబితాలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయగా.. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఆయా అభ్యర్థిత్వాలపై పునరాలోచించాలని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు తమ అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అసమ్మతి నేతల దారెటు? అన్నదానిపై సర్వత్రా చర్చనీయాంశమైంది.'

కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు రెండు జాబితాలను విడుదల చేయగా.. అక్టోబర్ 15న విడుదల చేసిన మొదటి జాబితాలో చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. శుక్రవారం విడుదల చేసిన రెండో జాబితాలో మహేశ్వరానికి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. నిన్నమొన్నటివరకు ఆయా నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న ముసలం కాస్తా.. టికెట్ల ఖరారుతో భగ్గుమన్నది. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానానికి మొత్తం ఏడుగురు నేతలు పోటీపడ్డారు. వీరిలో మల్‌రెడ్డి రంగారెడ్డి, దండెం రాంరెడ్డిల పేర్లు ప్రధానంగా వినిపించాయి. అయితే కాంగ్రెస్ అధిష్టానం మల్‌రెడ్డి రంగారెడ్డి వైపే మొగ్గు చూపడంతో దండెం రాంరెడ్డి అసంతృప్తితో రగిలిపోతున్నారు. తన అనుచరులతో కలిసి మీడియా ముఖంగా గోడు వెళ్లబోసుకున్నారు. చివరి నిమిషం వరకు తన పేరు సెంట్రల్ ఎలక్షన్ కమిటీలో ఉన్నదని, కొందరు జిమ్మిక్కులు, కుట్రలు చేసి తనకు టికెట్ దక్కకుండా చేశారని ఆరోపిస్తున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థిత్వంపై పునరాలోచించాలని అధిష్టానానికి అల్టిమేటమ్ జారీ చేసిన ఆయన కార్యకర్తలతో మరోసారి చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని చెబుతున్నారు. కిచ్చెనగారి లక్ష్మారెడ్డికి టికెట్ కేటాయింపుపై మహేశ్వరం నియోజకవర్గంలోని అసమ్మతి నేతల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతా నర్సింహారెడ్డి, మరో నేత దేప భాస్కర్‌రెడ్డి టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరు సైతం తమ అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. నేడోరేపో తదుపరి కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.

**టికెట్ రాని నేతల దారెటు..?**

కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కక భంగపడ్డ నేతలు ఏం చేస్తారనే.. ఉత్కంఠత పార్టీ వర్గాల్లో నెలకొంది. చేవెళ్ల టికెట్‌ను భీం భరత్‌కు కేటాయించడంతో టికెట్ కోసం పోటీపడ్డ పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్ధేశ్వర్, భీంభరత్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల బరిలో ఉంటానని చెబుతున్న ఆయన ఇటీవలనే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి భీంభరత్ అభ్యర్థిత్వంపై పునరాలోచన చేయాలని కోరారు. ఇబ్రహీంపట్నం టికెట్ దక్కని దండెం రాంరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఆశావహులు చిగురింత పారిజాతా నర్సింహారెడ్డి, నేత దేప భాస్కర్ ఏం నిర్ణయం తీసుకుంటారోనని క్యాడర్ సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నది. స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీలో ఉంటారా? లేక కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? అని చర్చించుకుంటున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకుని బుజ్జగించినప్పటికీ పార్టీ ప్రకటించిన అభ్యర్థికి ప్రచారం చేస్తారా? అన్నది కూడా ప్రశ్నార్థకమవుతున్నది.

# జనంలోకి బలగం



రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం

**ఓటర్లతో మమేకమవుతున్న తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు**
**నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం**
**గడపగడపకూ వెళ్లి మ్యానిఫెస్టోను చూపుతూ ఓట్ల అభ్యర్థన**
**సంపూర్ణ మద్దతు తెలుపుతున్న ప్రజలు**

తాండూరు, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం కోసం తాండూరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పంజుగుల రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు జనంలోకి వెళ్తున్నారు. తాండూరు గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేసేందుకు కదన రంగంలోకి దిగారు. ఇప్పటికే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా వారికి మద్దతుగా సతీమణి ఆర్తిరెడ్డి, తల్లి ప్రమోదినీదేవి, తండ్రి విఠల్‌రెడ్డి, బాబాయ్ శ్రీశైల్‌రెడ్డితోపాటు బంధుమిత్రులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని గడపగడపకూ వెళ్లి పార్టీ మ్యానిఫెస్టోను చూపుతూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్నారు. మహిళలకు బొట్టు పెట్టి, వృద్ధులను ఆత్మీయంగా పలకరిస్తూ, యువతకు అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు. తాండూరులో రోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, ప్రజలపై చూపించిన ఆత్మీయత, అనురాగంతో స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. వార్ వన్‌సైడేనని.. రోహిత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



రోహిత్‌రెడ్డి భార్య ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న దృశ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

# రేవంత్‌రెడ్డివి కాదు.. 'రేటెంత'రెడ్డివి

**నాడు ఓటుకు నోటు.. నేడు సీటుకు నోటు**
**కబ్జాల విచారణకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా..?**

తాండూరు, అక్టోబర్ 29: నాడు ఓటుకు నోటు నేడు సీటుకు నోటు... ఇప్పుడు రేవంత్‌రెడ్డి కాదు 'రేటెంత' రెడ్డిగా కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని తాండూరు ఎమ్మెల్యే పి.రోహిత్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బస్సుయాత్ర ప్రారంభంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీతో పాటు తమపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ మాట్లాడడంపై ఫైర్ అయ్యారు. తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు, రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తే ఏమీ జరుగలేదని రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రేవంత్ నోరు అదుపులో పెట్టుకోవాలని, సీఎం కేసీఆర్‌తో పాటు నా గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. నువ్వెంత..? నీ బతుకెంత..? నువ్వొక బ్రోకర్, చీటర్, దమ్ముంటే కొడంగల్‌లో మా బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై గెలువు చూద్దామని సవాల్ చేశారు. కబ్జాల విచారణకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా..? గుడి, మసీద్, చర్చ్ ఎక్కడికి రమ్మంటే అక్కడకి వస్తా నువ్వు రా... నీ కబ్జాల చిట్టా చూపిస్తానని మీడియా ముందు రేవంత్‌రెడ్డి భూ కబ్జాల పత్రాలను చూపించారు. గత ఎన్నికల్లో అఫిడవిట్‌లో నువ్వు చూపించిన ఆస్తుల వివరాలు ఎన్ని..? అక్రమంగా ఇప్పుడు ఎన్ని సంపాదించావనేది నేను చూపిస్తానన్నారు. తెలంగాణలో ముందెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ సీట్లను అమ్ముకున్నాడని, కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని సొంత పార్టీ వారే అంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ అభ్యర్థుల టికెట్లను ఫర్ సేల్‌కు పెట్టి ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని

- నువ్వెంత..? నీ బతుకెంత..? దమ్ముంటే కొడంగల్‌లో గెలువు
- కాంగ్రెస్ పీనుగు... 6 గ్యారంటీలతో లేస్తదా..?
- ఎవరెన్ని కుయుక్తులు పన్నినా బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరు
- భారీ మెజార్టీతో తాండూరులో బీఆర్‌ఎస్‌దే గెలుపు
- మీడియా సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

మండిపడ్డారు. కాంగ్రెస్ పీనుగు... 6 గ్యారంటీలతో లేస్తదా అని ఎద్దేవా చేశారు. వారంటీ లేని 6 కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను చూస్తే గమ్మత్తుగా ఉందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన పథకాలు ప్రజలను మోసం చేసేవిధంగా ఉన్నాయని తెలిపారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరన్నారు. గత పథకాలను అమలు చేస్తూ నూతనంగా మళ్లీ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ఎకరానికి రూ.16 వేల రైతు బంధు, సౌభాగ్యలక్ష్మి పేరుతో పేద మహిళలకు రూ.3000, రూ.400లకే వంటగ్యాస్, ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా సౌకర్యం, కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా వైద్య చికిత్సలకు రూ.15 లక్షలు, రేషన్‌పై సన్నబియ్యం, అర్హులైన వారికి రూ.5016 ఆసరా పెన్షన్లు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, స్వశక్తి మహిళా గ్రూపులకు భవనాలతో పాటు పలు నూతన పథకాలను ప్రవేశ పెట్టనున్నట్లు వెల్లడించారు. తాండూరు కాంగ్రెస్ అభ్యర్థికి తాండూరు నియోజకవర్గం గురించి ఏమి తెలియదని విమర్శించారు. డబ్బులు పోసి టికెట్ కొని ప్రజలను డబ్బులతో కొనాలని చూస్తే ప్రజలు మోసపోరని ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. తాండూరులో అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి, కరుణం పురుషోత్తం రావు, గులాబీ నేతలు నయీం, శ్రీనివాస్‌చారి, రవీందర్, కౌన్సిలర్లు ఉన్నారు.